# 12. వృత్తిధర్మం

పట్టు వదలని విక్రమార్కుడు చెట్టెక్కి, శవాన్ని భుజం మీద వేసుకొని దిగి, మెల్లిగా నడక సాగించాడు.

శవాన్ని ఆవహించిన భేతాళుడు "రాజా! కాని పని పూనటం, పూనిన పని మానటం నీబోటి వాడికి సాధ్యపడదు. వృత్తిధర్మాలను అతిక్రమించటం కూడా ఒకో సందర్భంలో అవసరమవుతూంటుంది. ఐతే అందువల్ల ఎంతో మేలు ఆశించటంలోనే వివేకం ఉండాలి కదా! అలాటిది ఏదైనా నీ యీ కార్యాచరణలో ఉన్నదో, లేదో నాకు తెలియదు... త్రికాల వేదినైన నేను, ఇరవయ్యో శతాబ్దానికి సంబంధించిన వసంత బి.ఎస్.సి., కథను చెప్ప దలిచాను. ఇదివరకువలె గాక, శృంగారంలో రంగరించి సాతాళించిన భేతాళీయంలోంచి యీ కథను ఎన్నుకున్నాను. వైవిధ్యం ఉండేట్లు, మనోల్లాసంగా ఉండే యీ కథ వింటూంటే నీకు శ్రమ తెలియకుండా ఉంటుందని ఆశిస్తున్నాను. ఇక కథ విను–" అని కథ చెప్ప నారంభించాడు:

తల్లికి ఏకైక పుత్రిక వసంత: ఎప్పుడైతే 'తల్లి'ని కర్తగా పేర్కొన్నానో ఆమె వైశిక వృత్తిలో ఉండి ఉండాలని నీవు గ్రహించే ఉంటావు. పేరుకో తండ్రి అంటూ ఉన్నప్పటికీ అతన్ని పోషించే బాధ్యత కూడా తల్లిదే! తన వలెనే ఈ వేశ్యా వృత్తి అనే సాలెగూటిలో వసంత చిక్కుకోకుండా ఉండాలనే సదుద్దేశ్యంతో ఆమె తల్లి అనేక కష్టాలను ఓర్చి బి.ఎస్.సి. దాకా కూతురుకు చదువు చెప్పించింది.

వసంత అందాలరాశి. చాలా తెలివి గలది. ప్రపంచాన్ని చూసి అనేక విషయాలను తేలిగ్గా గ్రహించగల విజ్ఞానమూ, వివేకమూ అలవరుచుకున్నది. నవ యవ్వనవతి;

నాగరికత ద్వారా పొందిన కృత్రిమ సౌందర్యం కూడా కలుస్తే మెరుగులు దిద్దుకున్న మాణిక్యంవలె మొదటిచూపులోనే ఎంత కొమ్ములు తిరిగిన స్త్రీ ద్వేషినైనా సరే ఇట్టే ఆకర్షించగల ఆడపిల్ల!

చదువుకునే రోజుల్లోనే అనేకమంది యువకులు ఆమె వెంటపడ్డారు. ఐతే ఆమె నిగ్రహంతో వారిని తగినంత దూరాన ఉంచటంలో ఎన్నడూ అశ్రద్ధ చూపలేదు.

తనకు నచ్చిన యువకుడు తన కొరకై పడిగాపులు పడి ఉన్నప్పుడు – తనను వివాహమాడమని ఆమె కోరింది. ఏ యువకుడూ అందుకు ఒప్పుకోలేదు. ఇందులో ధనికవర్గపు వారు మాత్రం తన కన్యాత్వానికి వేలువేలు కురిపించి అనుభవించేందుకు మాత్రమే సిద్ధపడినట్టు తెలియపరిచారు.

ఏమిటీ చిత్రం! ఒక్క రాత్రి అనుభవాన్ని పెద్ద వెల ఇచ్చి కొనుక్కునేందుకు వీళ్ళెందుకు సిద్ధపడ్డారు? జీవితమంతా కేవలం పోషణ భారాన్ని మాత్రమే భరిస్తే, తాను తన శక్తివంచన లేకుండా ఆనందామృతాన్ని అందించేందుకు సిద్ధపడితే వీళ్ళెందుకు ఒప్పరు?

వసంతకు వొళ్ళు మండిపోయింది. పురుషుని బాధ్యతా రహితమైన స్వార్థం స్త్రీని బానిసకన్న హీనంగా చేస్తున్న సిద్ధాంతాన్ని ఆమె గ్రహించింది. దీనికి విరుగుడు ఏమిటా అని దీర్ఘంగా, తెలివిగా ఆలోచించింది.

తను ఒక యింటి యిల్లాలయితే చూడాలని తల్లి ఆశించింది. నిజానికి తన ఆశయమూ అదే. వేలకువేలు కట్నాలు పోస్తేనే తప్ప ఎక్కడా తగిన వరుడు లభ్యపడని పరిస్థితి: తాత్కాలిక అనుభవానికైతే తనకు యెదురిచ్చేందుకు ఎంతోమంది సిద్ధంగా ఉన్నారు!

వసంత డిగ్రీ తీసుకొనే సమయానికి రోగిష్టి తల్లీ, తాగుబోతు తండ్రీ ఆమె మెడకు చుట్టుకున్నారు. వీళ్ళను పోషించవలసి బాధ్యత వసంత పాలపడింది. కేవలం పోషణేనా? తల్లికి మందులూ, మాకులూ, తండ్రికి తాగుడు కూడా సరఫరా చేయవలసి ఉన్నది!

ఏ ఉద్యోగమూ తన సంసారం గడిచేందుకు సహాయ పడదని వసంత గ్రహించింది. ఉద్యోగాన్ని కాపాడుకోవటమంటే తన శీలాన్ని రక్షించుకోవటమే అవుతుందని ఆమెకు తెలుసు.

ఉద్యోగానికైనా శరీరాన్ని అమ్ముకోక తప్పదు కదా! తాను తొక్కిన తోవనే కూతురు తొక్కకుండా చేయాలని తల్లి విశ్వప్రయత్నాలు చేసి విఫల ఐంది. ఆమె తన నోటితో అయితే ఏమీ చెప్పలేదు గాని, తల్లి అభిప్రాయ మేమిటో వసంతకు అరటిపండు వొలిచి అరిచేతిలో పెట్టినంత స్పష్టంగా తెలుసు.

ఉద్యోగ ప్రమేయాన్ని వొదులుకున్నాక, వ్యాపారాన్ని గూర్చి ఆమె తీవ్రంగా ఆలోచించింది. ప్రపంచంలో అతి పురాతనమైన వ్యభిచార వ్యాపార మొక్కటే తాను సక్రమంగా, సమగ్రంగా, దిగ్విజయంగా నిర్వర్తించ గలనని ఆమె నిశ్చితాభిప్రాయాన్ని ఏర్పరచుకున్నది.

ఇతర వ్యాపారాల కయితే పెట్టుబడి అవసరం. అదీగాక కొనటం అమ్మటం మొదలైన వాటిల్లో లాభ మొచ్చేందుకు ఎంత అవకాశ మున్నదో నష్ట మొచ్చేందుకూ అంతే అవకాశమున్నది! ముఖ్యంగా వ్యాపార రహస్యాలూ, అనుభవమూ అవసర మవుతవి. ఆ రెండూ లభ్యమయ్యేనాటికి ఉన్న పెట్టుబడి హరించుకు పోతుంది!

అందుకని తన అందచందాలూ, యవ్వనమే పెట్టుబడిగా వ్యాపారాన్ని సాగించినట్లయితే, ఏవిధంగానూ నష్టపడవలసిన పనిలేదు. ఇక వ్యాపార రహస్యాలూ, అనుభవమూ– ప్రకృతే ప్రసాదించింది: మరికాస్త తెలివితేటలకు మానవ మనస్తత్వ సిద్ధాంతాలు కూడా జోడించినట్లయితే యింతకన్న తేలిగ్గా ధనార్జన చేయగలిగే సావకాశం మరొకటి ఉండబోదు!

దేన్నయితే అమూల్యమైనదిగా భావిస్తామో, దాన్ని కాపాడుకోలేక నానా అవస్థ పడాలి. అనేక ప్రకృతి శాసనాలను అతిక్రమించి, ఎదురీదటం కూడా మాటలు చెప్పినంత తేలికకాదు. మొదటిసారి మాత్రం చేయిజారిపోయినా ఫర్వాలే దనుకుంటే ఇక గొడవ ఉండదు. యీ సిద్ధాంతాన్ని అనుసరించి, వసంత తన సౌశీల్యాన్ని పోగొట్టుకునేందుకు నిశ్చయించుకున్నది. అదీ ఒక్కసారే కదా అపహరించబడేది! దాన్ని పదిలంగా భద్రపరుచుకున్నందువల్ల కలిగే సుఖసౌఖ్యాలు లేవు సరికదా, నానా అవస్థలూ పడవలసి వస్తోంది. కోల్పోయేందుకు సిద్ధపడితే సకల సౌఖ్యాలూ కరతలామలకాలు!

మొదటినుంచీ, యీ నాటివరకే గాక, ఏనాటి వరకైనా సరే మానవుణ్ని చిందరవందర చేసే సమస్యలు రెండే రెండు: ఒకటి: ఆకలి, రెండు: కామం. ఆ రెండూ తీరేందుకే నరుడు నానా అవస్థలూ పడుతున్నాడు. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి ప్రకృతి శాసించిన స్వభావసిద్ధమైన 'ఇన్‌స్టిన్‌క్ట్'ను కా దని కాలదన్నగల ధీరుల్ని వేళ్ళమీద లెక్కించవచ్చు.

స్వభావసిద్ధంగా ఉన్న డిమాండ్‌ను కొత్త కొత్త పద్ధతుల ద్వారా కృత్రిమ విధానాలతో ఎంతయినా సాధించవచ్చు. అందుకని వైశికంలో కూడా వసంత అనేక కొత్త పుంతలు తొక్కింది.

తాను అసామాన్య సౌందర్యవతి అనీ, తనను కామించని పురుషపుంగవులు దాదాపు లేరనీ ఆమెకు తెలియకపోలేదు. వారందరూ తన శరీరాన్ని రాబందులవలె పొడిచి పొడిచి భక్షించి యవ్వనాన్ని జుర్రుకొని, ఎముకలూ, చర్మం మాత్రమే

మిగులుస్తారనీ ఆమెకు తెలుసు. ఇందుకు తార్కాణం తన కళ్ళ ఎదుట మంచాన పడివున్న తల్లే!

కనుక యెక్కువకాలం యీ వృత్తిలో ఉండటం క్షేమకరం కాదు. అల్ప వ్యవధిలోనే అత్యధికంగా ధనసంపాదన చేయాలి. అందుకని వసంత తెలివిగా కార్యసాధనకై ప్రయోగార్హమైన ఒకే ఒక పంచవర్ష ప్రణాళికను రూపొందించింది.

కాలిన ఇనుం మీద పడే సమ్మెట దెబ్బలు ఒక్క ఇనుముకే కాకుండా సమ్మెటకు కూడా తగులుతూనే ఉంటవి గదా! ఈ సిద్ధాంతాన్ని అనుసరించి విటులు తన శరీరానికి జరిపే డేమేజెస్ రేట్లను విపరీతంగా పెంచటం ద్వారా, తాను వారిని పీల్చి పిప్పి చేసే సదవకాశాన్ని ఆమె ఏర్పరుచుకున్నది. ఇందువల్ల విటుల సంఖ్య బాగా తగ్గిపోతుంది. ఒక్క పంచవర్షప్రణాళికలోనే కనీసం తన తరం గడిచేటంత సంపాదించుకోవచ్చు!

డిమాండ్‌ను అనుసరించి రేటు పలుకుతుందనీ, వాతావరణాన్ని అనుసరించి డిమాండ్ ఏర్పడుతుందనీ వసంత గ్రహించింది. ఆంధ్రదేశం నుంచి దిగుమతయే నవయవ్వనులయిన అమ్మాయిల రేటు బేసిన్‌బ్రిడ్జి వరకూ రాత్రికి పది రూపాయలయితే, సెంట్రల్‌లో కాలుపెట్టిన క్షణం నుంచీ మూడింతలు పెరుగుతుంది. అదే విధంగా పూరిపాకలో ఉండే పడతికి రాత్రికి ముప్పై రూపాయ లయితే, మంచి దుస్తుల్లో అదే అమ్మాయి ఏ బంగళాలోనో ఉంటే నూరూ-నూట ఏభై వరకూ పలుకుతుంది. ఈ విధంగా కృత్రిమంగా అంతస్తు పెరగటం ద్వారా విలువ కూడా పెరుగుతుంది.

అమాయకుడు నిప్పులో వేలుపెట్టి కాల్చుకుని నిప్పుగుణాన్ని తెలుసుకుంటాడు. విజ్ఞుడు నిప్పులో ఎవరి చేయో కాలగా చూసి, గ్రహిస్తాడు. మన యీ నాయకి రెండో కోవకు చెందిన కోమలి.

వ్రతం చెడినా అధిక ఫలం దక్కటం ఆమె ఆశయం. సముద్రంలో చేపలు పట్టదల్చుకున్నాక, తిమింగలాలనే గురి చూడటం మంచిది. అందుకని వసంత తన రేటు ఒక్కరాత్రికి వేయి రూపాయిలుగా నిర్ణయించింది.

ఇంతగా కొండెక్కి కూర్చున్నాక, ఇంత ధర ఇవ్వ దగిందేనా అని విటుడు సహజంగానే ఆలోచించక మానడు. అంటే విటుడ్ని ఆకర్షించి, వేయి రూపాయిలూ అతను చెల్లించేట్టు చేసేందుకు ఆమె కొత్త కొత్త పథకాలను అమలు జరిపింది.

ఇంట్లో ఉన్న కొద్ది బంగారాన్నీ అమ్మివేసి బీచ్ వొడ్డున నెలకు నాలుగొందలకు ఒక పెద్ద బంగళా అద్దెకు తీసుకున్నది. ముందు చక్కని తోటా, ఎంతో మంచి గాలీ చూపరులకు ఇదో గొప్పిల్లు అనే భావం కలిగేటట్లున్నది.

ఆభరణాలేమీ లేకుంటే వివిధాంగాలు బోసిపోయిన ట్లుంటవని రోల్డుగోల్డు నగలు కొన్నదామె. ఇంటి హంగు గమనించిన వ్యక్తికి ఆమె వొంటిమీది నగలు మేలిమి బంగారు ఆభరణాలే ననే భావం కలగక మానదు కదా!

ఇంట్లో టెలిఫోన్ అమర్చింది. అది పగలల్లా హాలులోనూ, రాత్రి మాత్రం పందిరిమంచానికి చేతికి అందుబాటులో ఉండేటట్లుగానూ ఏర్పాటు చేసింది. తనకోసం వచ్చేవాళ్ళు అసామాన్యులు. వారికి ఏ క్షణాన ఏ అవసరం కలుగుతుందో తాను గమనించాలి. తనతో సరససల్లాపాలాడుతూ, శృంగారం వొలకబోస్తూనే ఏ 'ట్రంక్' కాల్ చేసినా చేయవచ్చు. అందుకని విటునికి సకల సౌకర్యాలూ కల్పించటంలో ఆమె ఈ శ్రద్ధ వహించింది. విటుడు భంగిమనూ, విన్యాసాన్నీ మార్చుకోకుండానే తన అర్జెంటు పనులన్నింటినీ సులభంగా నిర్వహించుకునే ఏర్పా టిది!

విటుడు కోరేది కేవలం కామతృప్తి మాత్రమే కాదని ఆమెకు తెలుసు. కామతృప్తిని మాత్రమే ఇవ్వగలిగిన వేశ్యలు తన రేటుతో పోలిస్తే, కారు చౌక రేటుకు అందివ్వగలిగినవారు అనేకమంది యీ మహా పట్టణంలో ఉండనే ఉన్నారు.

కనుక ఆమె విటునికి మరెక్కడా లభించని అమరసుఖాన్నివ్వాలి. కేవలం శరీర సుఖమే కాకుండా- ఆత్మ కాకున్నా హృదయాన్ని కూడా ప్రియునికి సమర్పించాలి. వేశ్యకు ఇదెలా సాధ్యమనే సందేహం ఉండనే ఉంది.

ఏ పనైనా సరే సక్రమంగా, పరిపూర్ణంగా నిర్వహించాలంటే- ఆ పని చేయటంలో ఆనంద ముండాలి. కేవలం వెలయాలిగా ప్రవర్తించిన ట్లయితే, వెల ఇవ్వబడింది కనుక, విటుడు ఎవరైనా సరే ఎలాటివాడైనా సరే తాను లొంగి ఉండవలసిందే! ఇలాటి వ్యవహారంలో సర్వసాధారణంగా వేశ్య ఆనందానికి మారుగా బాధనే అనుభవిస్తుంది. ఆ బాధకు వెల చెల్లించబడింది కనుక కిమ్మనకుండా దాన్ని భరిస్తుంది. ఎప్పుడో యాదృచ్ఛికంగా తనకు నచ్చిన విటుడు లభ్యమైననాడు మాత్రమే ఆమె కూడా అతనితోపాటే ఆనందిస్తుంది.

ఎలాటి పితలాటకం, దాపరికం లేకుండా ఉండేందుకు వసంత- విటుడు వేయిరూపాయలు చెల్లించినప్పటికీ, తనకు నచ్చాలనే షరతు పెట్టింది. వేయికాదు కదా- పదివేల రూపాయలు సమర్పించిన విటుడైనా సరే తనకు నచ్చకుంటే, తిరస్కరించేందుకు సిద్ధపడింది. మొదట్లో 'ఇది ఒక జోక్!' అనుకున్నవారు తాము పొరపాటు పడ్డామని త్వరలోనే తెలుసుకున్నారు.

ఈ 'తనకు నచ్చటం' అనే షరతువల్ల- తాను హృదయపూర్వకంగా విటునితో సుఖపడే అవకాశాన్ని సాధించగలదామె! తనను బాధించే యవ్వనమూ, కామవాంఛలూ ఉన్నవి. వాటిని తృప్తిపరుచుకుంటూ, ధనసంపాదన కూడా చేయగలిగే పథక మిది! రెండు పక్కలా పదునున్న కత్తి యీ పథకం!

చాలా ఖరీదైన దుస్తుల్ని అద్దెకు తీసుకొని మంచిరకం ఫర్నిచర్ కూడా అద్దెకు తీసుకొని బంగళాను నింపింది. ముఖ్యంగా ఆమె పడకగది చూసి, ఆశ్చర్యపడని

విటుడు అరుదు! హంసతూలికాతల్పానికి సమమట్టంలో గోడకు ఒక నిలువుటద్దాన్ని అడ్డంగా అమర్చింది. శయ్యమీది శృంగార ఘట్టాలన్నీ యథాతథంగా దర్పణంలో ప్రతిఫలించి నాయకుని పురుషత్వాన్ని ఎంతగానో రెచ్చగొడుతవి.

యీ విధంగా తన పొత్తు కోరినవాడు పరిపూర్ణానందాన్నీ తృప్తినీ పొందే అవకాశాలన్నీ ఆమె ఏర్పాటు చేసింది.

నెలకు 'ఇంత' అని ఒక ప్రయివేటు టాక్సీ మాట్లాడుకొని తన ఆధీనంలో ఉంచుకోవటంలో ఆమె హోదా, అంతస్తూ శిఖరాగ్రాన్ని అందుకొన్నవి.

ఈ అట్టహాసాన్ని చూసిన విటుడు– తనకు నిజంగా యోగ్యత లేనిదానికోసం వచ్చాననే 'ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు'కు గురవటం సహజం. ఇక తనకు నచ్చిన యువకుడు తనను మెచ్చేట్లుగా చేసే బాధ్యత రతీదేవిలాంటి వసంత వంతు. ఏ పురుషుణ్ని ఏ విధంగా దారికి తేవాలో, ఏ యే అభిరుచులున్నవాణ్ణి ఆయా రుచులతోనే సత్కరించి ఆనందింపజేయాలో వసంత ప్రయోగాత్మకంగానూ, అనుభవపూర్వకంగానూ, తన తెలివితేటలతో కనుగొని సాధించింది.

'పాత ఒక రోత; కొత్త ఒక వింత' అనే సామెత ఉండనే ఉన్నది. యీ వసంత నవ వసంతంవలె అన్నీ కొంగ్రొత్త పద్ధతుల్ని అమలు జరపటంలో విటవర్గాన్ని ఆకట్టుకోగలిగింది.

రసికతా, పురుషత్వమూ ఉన్నవాడికి డబ్బు లేకుండటం, డబ్బున్నవాడు అరసికుడవటం సర్వసాధారణ విషయం. యీ రెండూ కలిగినవాళ్ళు బహు అరుదు. తను అసామాన్య సౌందర్యవతి కావటంతో, అసామాన్యుల పొందునే ఆశించి సాధించగలగటం, ఆమె షరతుల ప్రకారం సాధ్య మవుతున్నది!

ఆమెకు నచ్చిన విటుడు 'అందాలరాశి ఎన్నిక చేసిన మొనగాడు!' అనే అభిప్రాయం కలిగించే గర్వంతో తా నొక రసికాగ్రేసర చక్రవర్తి నని ఉప్పొంగటంలో ఆశ్చర్యమేమీ లేదు.

తనకోసం వచ్చే రసికుడు ఎవరయినప్పటికీ, అతను తన తోటి ఒక్కరాత్రి అనుభవానికి వేయి రూపాయలు రొఖ్కం చెల్లించేందుకు సిద్ధపడే ఉన్నవాడు కావటంవల్ల, అతను తనకు నచ్చని పక్షంలో, నొప్పించకుండా పంపించటం వసంత తన విధిగా భావించి ప్రయోగించింది.

నవయవ్వనీ, ఇంపుగా, సొంపుగా ఉన్న చదువుకున్న అమ్మాయిని తనకు సహాయకురాలుగా, సెక్రటరీగా, రిసెప్షనిస్ట్‌గా నియమించింది. తన వ్యాపారానికి అడ్డు రాకుండానూ, తన విధులను సక్రమంగా నిర్వహించేదిగానూ ఉండాలని ఆదేశించింది.

వచ్చిన రసికజనాలను ఆకట్టుకునే ఆ సహాయకురాలిని చూడగానే విటుడు 'సహాయకురాలే ఇంత దేదీప్యమానంగా ఉంటే, యజమానురాలు ఎలా ఉంటుందో కదా, అని లొట్టలు వేయటం ప్రథమావస్థ.

హాలులో పెద్ద నిలువుటద్దానికి ఎదురుగావున్న మెత్తని ఆసనంలో ఖాతాదారుణ్ణి కూర్చోబెట్టి, కాఫీయో, చల్లని పానీయమో ఇచ్చి, సహాయకురాలు యజమానురాలికి అతని రాకను తెలియపరిచేందుకు మేడ మీదికి వెళుతుంది.

ఎదురుగా ఉన్న అద్దంలో విటుడు అనేక పోజుల్లో తన అందచందాలను తిలకిస్తూ, మురిసిపోతూ, తాను వసంతకు తప్పక నచ్చుతానని తనకి తాను ధైర్యం చెప్పుకుంటూ, ఒకవేళ నచ్చకుంటే తనను కరుణించమని కులదేవతల్ని ప్రార్థించుకుంటూ గుటకలు మింగుతూ కూర్చుంటాడు.

విటునికి యెదురుగా ఉన్న అద్దంలోని అతని ప్రతిబింబం మేడమీద బాల్కనీలో అమర్చబడిన అద్దంలో ప్రతిఫలిస్తుంది. వసంత మేడదిగి రాకుండానే, విటుని కంట పడకుండానే అతనిని చూడగలదు. అంగీకరిస్తే కిందికి వచ్చి రొఖ్ఖం తీసుకుని పరిచయం చేసుకుంటుంది. నిరాకరిస్తే సహాయకురాలి ద్వారా అనారోగ్యమనో, చెరగు మాసిందనో- ఏదో ఒక సాకు చెప్పి, విటునికి వీడ్కోలు యిస్తుంది.

ఇన్ని నియమాలు, ఇంత వడబోత పెట్టినా అడపాదడపా మేడిపళ్ళు తగులుతూనే ఉంటవి. తాను ఆశించిన రసికత్వం లభ్యపడకున్నప్పటికీ- విటుని పురుషత్వాన్ని తాను భరించలేక బాధపడుతున్న విధంగా నటించి, అతని అహంభావాన్ని చెడనీయక, మరింత గర్వపడేట్లు చేయటం నియమబద్ధంగా ఆమె పాటించింది. 'ఒకసారి రుచి చూసిన మీకే తెలియగలదు' అని విషయాన్ని కార్యాచరణలో దిక్కులు పిక్కటిల్లే విధంగా విశదపరచటం ఆమె ప్రత్యేకతనే చెప్పాలి.

వసంత వ్యభిచార రంగంలో దిగిందని తెలియగానే విటపటాలం ఆమె ఆశయాన్ని అభినందించి, యెంతో మెచ్చుకున్నది. అయితే ఆమె నిబంధనలూ, నియమాలూ ముఖ్యంగా రేటూ వినేప్పటికి వారికి గుండెలు జారిపోయినవి.

వేయిరూపాయలు ఒక్క రాత్రికి ఇవ్వగల స్తోమతు ఉన్న వారయితే వేలమంది ఉన్నారు: కాని 'విటుడు ఆమెకు నచ్చటం!' అనే షరతు చాలా ఇరిటేటింగ్‌గానూ, రివోల్టింగ్‌గానూ వున్నది, చాలామంది ఆ ఛాయలకే పోరాదని నిశ్చయించుకున్నారంటే ఆశ్చర్యంలేదు.

మరికొంతమంది 'అందని ద్రాక్షలు పులుపు!' అన్న విధంగా చిత్రించి అదంతా పై పొటారమూ, లోపలి లొటారమేననీ, షో చేసి డబ్బు గుంజాలని వసంత ప్రయత్నం చేస్తోందనీ, యీ నియమాల ముళ్ళకంచెలు రసికులకు ప్రతిబంధకాలు కనుక, ఆమె ఆకాశపు టంచులనుంచి భూమిమీద కాలూనటమేగాక, త్వరలోనే ధూళిలో

దొళ్లుతుందనీ, అప్పుడు విటులు ముఠాలు ముఠాలుగా ఆమెను అనుభవించే అవకాశ ముంటుందని అనేకులు జోస్యం చెప్పారు.

మొదట్లో రసిక ప్రపంచం ఆమెను పొందేందుకు ఉత్సాహంగా ముందుకు ఉరకలేదు. ఆమె దక్కకపోగా అవమానం కూడా పొంది, గాయపడవలసి ఉంటుందని విలాస పురుషులు ఊహించే ఊరుకున్నారు. ఒక విధంగా ఆమెపట్ల సమ్మెచేశారనే అనాలి!

ఇదంతా విని వసంత తనలో తను నవ్వుకుంది. సమాజంలో అయితే ఏ స్త్రీ అయినా కంటపడటం వల్ల మనసు చలిస్తుందేమోనని భయపడి, కీకారణ్యాలలో తపోనిష్ఠలో నిమగ్నులైన - విశ్వామిత్రుడూ, ఋష్యశృంగుడూ మొదలుగాగల మహాజనులే- చివరకు ఆడది కనిపించగానే వొళ్ళు తెలియక మదోన్మాదులవగా లేనిది- అధునాతన ప్రపంచంలో టెర్లిన్ చీరెలూ, కట్ బాడీలూ, కుచ్చులు కుట్టిన లంగాలూ మొదలయిన పాకింగ్‌లోంచి అర్ధనగ్నంగా కనిపించే నవయవ్వనవతుల్ని చూసి వాంఛలు కలగనివాడు- షండుడే అవుతాడు; కావలసిందల్లా కొంచెం ఓర్పు: ఆ తర్వాత నేర్పుతో పురుషుణ్ణి లొంగదీసుకోవచ్చు- అనుకున్నది ఆమె.

అంతేకాదు, పెట్టగానే ఏ కొత్త వ్యాపారమూ వెంటనే ఎక్కదు. అది క్రమంగా మెల్లిమెల్లిగానే లోతులకు పాతుకుంటుంది. అంతవరకూ కాస్త ఓపిక పట్టట మొక్కటే మార్గమని వసంత తేల్చుకొని పట్టుదలతో చెట్టెక్కి కూర్చున్నది.

ఆమె ఊహించిన విధంగానే రసికుల సమ్మె నలభై ఎనిమిది గంటలు కూడా నిలవలేదు. మొదటి వరసలో ఉన్న సభ్యులు తమతమ దివ్యానుభూతుల్ని గూర్చి చెపుతూంటే- అదొక అగ్నిప్రమాదంవలె విట ప్రపంచమంతా అల్లుకొని పోయింది.

వసంత దగ్గరికి వెళ్ళొచ్చిన వాళ్ళకు స్వర్గం మీద నమ్మకం పూర్తిగా పోయింది. భూతల స్వర్గమూ, రంభా సంభోగమూ ఇక్కడే, ఇప్పుడే లభ్యమయే అవకాశాలుంటే- దానికోసం జీవితంలో అనేక త్యాగాలు చేస్తూ, వొంటికి పడని కషాయాలు సేవిస్తూ, అనవసరంగా అనేక శ్రమలకు లోనవటం వృథా శ్రమే అవుతుందని వారు ఏకాభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

విటవర్గ సభ్యులు వసంత రసికత్వాన్ని మెచ్చి ఆమెకు రకరకాల బిరుదులూ యిచ్చి, వాటిని ప్రచారంలోకి తీసుకొచ్చారు.

'ముల్లులేని మద్రాసు గులాబీ!' అన్నారు కొందరు.

'రసికజన మనోభిరామం!' అన్నారు మరికొందరు.

'రసిక రంజని!' అన్నారు ఇంకొందరు.

ఆమెను గూర్చి రకరకాలుగానూ రసికులు చెప్పుకొని చప్పరిస్తూ ఆనందించేవారు.

"ఇంత తిరిగాను కాని- నిజమైన స్వర్గసౌఖ్యమంటే వసంత దగ్గిరే పొందా ననుకో! వెధవ వేయిరూపాయిలు పోతేనేం గాక! ఆనందామృత కలశాన్ని హృదయపూర్వకంగా సమర్పించి, ఇష్టానుసారం పిండుకొమ్మనే కోమలి మరొకతె యీ ప్రపంచంలో ఎంత యిచ్చినా లభ్య మవదు!"

"ఆమె శరీరమే ఒక సుఖాల పుట్టనుకో! ఆనందమంతా ఆ శరీరంలోనే బంధించబడి తాళం వేసి వున్నది. దాన్ని తెరిచి, తవ్వుకున్నవాడు నిజంగా అదృష్టవంతుడు! అంతులేని ఆ ఆనందాన్ని యోగ్యత ఉన్నంతవరకూ రుజవు చేసి ఆస్వాదించవచ్చు!"

వసంత మొదట్లో అనుకున్న దిది. యీ రేటుమీద నెలకు మూడురాత్రులు జరుగుతేనే చాలు! అలాంటిది రెండవనెల నుంచే ఆ మూడురాత్రులే ఆమెకు నిజమైన విశ్రాంతి లభిస్తోంది!

ఇంత వడబోతలమధ్య కూడా చచ్చులూ, పుచ్చులూ యెదురయినప్పటికీ తన ఎన్నికకు ఒక్కరాత్రి మన్నికే కనుక, ఎలాగో మేనేజ్ చేసి విటుణ్ణి పరవశుణ్ణి చేయగల చాకచక్యాన్ని ప్రయోగించడం ద్వారా ఆమెకు ఎంతో పేరు వచ్చింది.

క్రమంగా వసంతకూడా యెంతో అనుభవాన్ని సంపాదించింది. యెంత కఠినమైన హృదయంగల పురుషుడైనప్పటికీ, కోమలమైన స్త్రీ శరీర స్పర్శతో- కఠినత్వమంతా కరిగి, మరిగి నీరుకారి వొంగి, వొరుగై లొంగిపోక తప్పదు!

ఎంత తీవ్రమైన పురుషత్వాన్ని ప్రదర్శించగల మొగాడయినప్పటికీ- స్త్రీ భయపడి వెన్నిచ్చి వెనుకాడే పక్షంలో, పురుషుడు ఆమెను దిగంతాల వరకూ వెంటాడి తరిమి తరిమి పట్టుకొని కొబ్బరివలె తురుముతాడు! అలాగాక ఆమె రొమ్మిచ్చి ఎదురాడి పోరాడే పక్షంలో స్త్రీకి విజయం తథ్యం!

తనను ఓడించి, చేతులు జోడించేట్లు చేసేందుకు తయారయిన ప్రియునికూడా ఎలా లొంగదీసుకోవాలో ఆమెకు తెలిసిపోయింది. తాను యెంత నిరోధించినా ఒక చేయి పైగానే ఉండే రసికునికి ఆమె పూర్తిగా లొంగిపోయి, నిరోధించదగిన అణువులు తన శరీరంలో మరి లేవనే ధోరణిలో జావగా మారితే, ఇక రసికునికి పట్టు ఉండదు. తాను నేలకరవటాన్ని ప్రదర్శిస్తే తనతో పోరాడే వ్యక్తికూడా తనతోపాటే నేల కొరగక తప్పదు కదా! ఈ విధానాన్నే ఆమె విజయవంతంగా ప్రయోగించింది.

అన్నీ పై మెరుగులనే అభిప్రాయం ఇప్పు డెవ్వరికీ లేదు. లోతులకు పోయినప్పటికీ, కృత్రిమ సౌందర్యం వెనుక ఉన్న సహజ సౌందర్యాన్ని కనుగొనటం రసికుల వంతు అయింది.

అందంలోనే కాకుండా ఆనందాన్నివ్వటంలోకూడా పందెం వేయగల పడతి యీ వసంత అనే మాటను కా దన్న విటుడు కరువైపొయ్యాడు.

తనను రంజింపజేయలేదు అని బిగుసుకొనిపోయిన విటుణ్ణి కూడా యే విధంగా లాలించి, కరిగించాలో ఆమెకు తెలుసు. మానువలె పాతుకుపోయిన ప్రియుణ్ణి లతవలె చుట్టి, చుట్టి త్వరలోనే చిటారు కొమ్మలెక్కి వెక్కిరించగల నేర్పును ప్రదర్శించగల దామె!

అంతేకాదు– ప్రతి విటుడూ కొత్త చెప్పులజత లాటివాడు. ఏ యే భాగాలు యెంతెంత తీవ్రంగా కరుస్తవో, లేక దయతలచి కాళ్ళకు అలవడి సరిపెట్టుకుంటవో తొడిగి, తొక్కేదాకా చెప్పుల విషయంలో ఎలా చెప్పలేమో, యీ విటపటాలం విషయంలోనూ అంతే! ప్రతి కొత్త ప్రయోగంలోనూ ఆమె చాకచక్యాన్ని ప్రదర్శించి విజయాన్ని సాధిస్తూనే ఉన్నది.

మామూలు వ్యక్తిగా కనిపించేవాడు కూడా శయన మందిరంలో అగ్నిపర్వతం వలె పేలుతాడు; అది కనిపెట్టి ఆ పొగలూ, సెగలూ లావాలను అవలీలగా స్వీకరించేందుకు సఫలయత్నం చేస్తుం దామె.

పంచబాణుని ఐదు బాణాలూ – పంచేంద్రియాలే కదా! అందుకని ఆ పంచేంద్రియాలనూ తృప్తిపరచటమంటే మన్మథ సామ్రాజ్యాన్ని జయించి పాలించటమే అవుతుంది. ఈ సిద్ధాంతాన్ననుసరించి వసంత విటుని పంచేంద్రియాలకూ అమర సౌఖ్యాన్ని అందించటం ద్వారా గొప్ప పేరుప్రఖ్యాతులు పొందింది.

రసికుడు తన్మయుడై కట్నాలు కానుకల కింద మొదట చెల్లించుకున్న వేయి రూపాయలు గాక, మరేమన్నా ఇవ్వజూపితే ఆమె సౌమ్యంగా నిరాకరించేది. బేరం, గీరంలేని ఒకే వెల తీసుకునేందుకు మాత్రమే ఆమె సమ్మతించేది. ఆమె ఆశను ఆశ్రయించింది. దురాశను దూరతీరాలకు తరిమివేసింది. ఈ సుగుణాన్ని గమనించిన విటుని దృష్టిలో ఆమె అంతస్తు యెంతగానో పెరగటంలో ఆశ్చర్య మేముంటుంది?

ఇంత అందగత్తెను తెరకు ఎక్కించాలని చాలామంది విశ్వప్రయత్నాలు చేశారు. కాని ఆమెకు తెలుసు; శోభనమందిరంలో దిగ్విజయంగా నటించి, మెప్పించి సెబా సనిపించగల తన కౌశలాన్ని విడనాడి, తెరకెక్కి తైతక్కలాడి ఏమవుతుందో నమ్మకం లేని దానిమీద ప్రయోగించటం అవివేక మని! ఆ విషవలయం నుంచి తనను తాను కాపాడుకున్న దామె!

టోకుగా నెలకు ఇరవై వేలు యిచ్చి ఆమెను స్వంతం చేసుకోవాలని కూడా కొంతమంది ప్రయత్నించారు. ఆమె తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను విడనాడేందుకు సమ్మతించలేదు. ఈనాడు యింత ప్రేమ చూపేవాడు రేపు ఏమవుతాడో తెలియదు. ఈ వెధవ రిస్కుల జోలికి ఆమె పోదలచలేదు!

మరికొంతమంది యువకులు ఆమెను వివాహమాడేందుకు సిద్ధపడ్డారు. అయితే పెళ్ళిని గూర్చిన ఆమె భ్రమలన్నీ విడిపోయినవి. అందుకని ఆమె తన అంగీకారాన్నెప్పుడూ యివ్వదలచలేదు.

రకరకాల మనుషులూ- చిత్రవిచిత్ర మనస్తత్వాలున్నవారూ, సంస్కారంలో, అభిరుచుల్లో, ప్రవర్తనల్లో, ఉద్రేకంలో- ఒకటేమిటి అన్నిటా భేదాన్ని ప్రదర్శించేవారితో ఆమె ఒక రాత్రి గడపవలసి ఉంటుంది. అది కేవలం ఆమె వృత్తి ధర్మం కదా!

అందుకని ఆమె అనేక ఏర్పాట్లు చేసింది. ఉదాహరణకు ఒక ప్రియుడు చీకటిగా ఉంటేనే తప్ప 'చీకటి తప్పు'కు పూనుకోడు. మరొకడికి గుడ్డి వెలు గుండాలి. ఇంకొకనికి దేదీప్యమానమైన కాంతి కావాలి. ఈ లైటింగ్ వ్యవహారం ఎలా కావాలంటే అలా ఉంచే ఏర్పాటు చేసిం దామె.

అదేవిధంగా ప్రియునికి అలసట రాకుండానూ, కోల్పోయిన ధాతువును పూరించేందుకు - రకరకాల తినుబండారాలూ, ఫలాలూ, పానీయాలూ- శయన మందిరంలో సిద్ధంగా ఉంచుతుందామె. శోభనపు పెళ్ళికొడుక్కు కూడా జరగని మర్యాదలన్నిటినీ పాటించి, తాను వలపు వొలకబోస్తే, రసికుడు శృంగారాన్నే వొలకబోసే విధంగా సమర్థించగల సరసురా లయింది- వసంత!

చిల్లర బేరాలను ఆమె ఒప్పదు. అంతా హోల్ సేలే!

రాత్రిపడిన శ్రమ తెలియకుండా ఉండేందుకు పగలల్లా ఆమె విశ్రాంతి తీసుకుంటుంది. రాత్రి వ్యయమైన కొవ్వును పూరించేందుకు విలువైన ఆహారాన్ని సేవిస్తుంది. సాయంత్రం పన్నీట జలకాలాడి అలంకరించుకుంటే- శోభనపు పెళ్ళికూతురువలె, మల్లెపూవు వలె, నవనవలాడుతూ చావబొయ్యే యోగిపుంగవునిలో కూడా కామజ్వాలల్ని రేపగల జవ్వనిగా రూపొందుతుంది.

ఈ పద్ధతుల్ని జాగ్రత్తగా అనుసరించటం వల్లనే ఆమె ప్రతిరాత్రీ ఒకో జారునికి అమరానుభూతిని ఇవ్వగలుగుతోంది. అంతేకాదు- తనకు నచ్చిన వయసు వానితో గడపటం వల్ల ఆమె కోరికల కలశం పరిపూర్ణమై, అంచుల్ని మించి పొంగి పొరలుతూ ఆమెకు కూడా యెంతో ఆనందాన్నిస్తోంది. ఆమె యవ్వనమూ, జిగీ, బిగీ ఎన్నటికీ తగ్గవేమో ననిపించేట్లు చేయగలిగిం దామె!

వసంత వృత్తి నారంభించాక- శతదినోత్సవం నాటికి ఆమె జీవితమే ఊహించరానంతగా మారిపోయింది.

ఆమె ఉంటూన్న ఇల్లు తప్ప మరే అద్దె సామానూ ఆమె వద్ద లేదు. ఆమె ఒక్కతె మాత్రమే యోగ్యులని తనచే భావించబడేవారికి అద్దెకు లభిస్తుంది.

అనేక బంగారు ఆభరణాలను చేయించుకున్నా, శయనాగారంలో మాత్రం గిల్టునగలే ధరిస్తుం దామె. మొగాణ్ని నమ్మినట్టు నటించటమే కాని, నమ్మటం తగదని ఆమె నమ్మకం. ఎవడైనా కొంటెవాడు తన నగలనే అపహరించే పథకం వేసినా, లెక్కచేయ నవసరం లేకుండా ఆమె యీ యెత్తును ప్రయోగంలోకి తీసుకొచ్చింది.

వసంత విజయయాత్రలు చూసి- మరికొంతమంది వేశ్యలు- పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు ఆ పద్ధతుల్ని ప్రవేశపెట్టి విఫలులై అసలుకు మోసం రాకుండా త్వరలోనే పాతపద్ధతులకు దిగజారి భంగపడ్డారు.

ఈ విధంగా నిజమైన ప్రణయామృతానికి వసంత ఒక్కతే సోల్ డిస్ట్రిబ్యూటర్‌గా ప్రసిద్ధికెక్కింది.

కొద్దిమంది యువకులు ఆమె పొందులోని ఆనందాన్ని అనుభవించగలిగినా, లెక్కలేనంతమంది లొట్టలు వేస్తూ ఊహా ప్రపంచంలో మాత్రమే విహరించగలిగారు!

## 2

ఇలా ఉండగా కొంతమంది కాలేజీ విద్యార్థులు వసంతను గూర్చిన కథలు విని, ఆ తపనకు తట్టుకోలేక ఏవిధంగానైనా సరే ఒక్కరాత్రికి ఆమె పొందు పొందాలని నిశ్చయించుకున్నారు.

ఏ ఒక్కరికీ ఆమె వెల చెల్లించే స్తోమతు లేదు.

అప్పుడు ఒక మేధావి ఒక కొత్త పథకం వేశాడు. జీవిత సౌఖ్యానికీ, అదృష్టానికీ అవినాభావ సంబంధం యెప్పుడూ ఉండనే ఉన్నది. అందుకని ఒక వందమంది జేరి తలా పదిరూపాయిలు చందాలు వేసుకొని- వందమంది పేర్లూ ఒకో కాగితం ముక్కమీద రాసి, పెట్టెలో వేసి గలబరించి, ఒక చీటీ తీసి, ఎవరి పేరు వస్తే వాళ్ళు వసంతను అనుభవించటం- ఆ పథకపు సారాంశం.

అయితే యిందులో గెలిచినా వసంతకు నచ్చటమనే నిబంధన ఒకటి ఉన్నది కనుక, యీ గెలిచినవాడు అక్కడ ఓడినట్లయితే, మళ్ళీ ఈ తతంగమంతా జరపకుండా ఉండేందుకు వరసగా అయిదు చీట్లు తీసేందుకూ, అదే వరసక్రమంలో వసంత చేత ఎన్నుకోబడేందుకూ, ఉత్తీర్ణుడే ఆ దివ్యానుభూతిని పొంది, ఆ తర్వాత దాన్ని గూర్చి చెప్పి మిగతా తొంభయితొమ్మిది మందికీ కర్ణానందం చేసేందుకూ నిర్ణయించబడింది.

మరోమార్గం లేదు కనుకే, తమ తమ అదృష్టాలను తూచుకునేందుకు ఇంతకన్నా సదవకాశం మరి రాదు కనుకా, ఎవరికీ కష్ట ముండదు కనుకా, కనీసం తాము కాకున్నా తమవర్గానికి సంబంధించిన ఒక ప్రతినిధికన్నా వసంతతోటి దివ్యానుభూతి దక్కుతుంది కనుకా ఈ పథకానికి అందరూ సానుకూలంగానే తయారయ్యారు.

అంచనాల ప్రకారం అంతా సక్రమంగా జరిగి, మోహన్ రావు అనే యువకుని పేరు లాటరీలో వచ్చింది. ఆ తర్వాత మరో నాలుగు పేర్లు వచ్చినవి. తొంభై ఐయిదుమందికి ఎలాటి ఆశా లేదు. ఈ పంచనామాలవారిలోనే ఒకర్ని చూసి మరొకరికి ఈర్ష్య ఏర్పడింది. తరువాత సెలక్షన్ పరీక్ష. తరువాత పబ్లిక్ ఎగ్జామినేషన్, ఆ తరువాత డిగ్రీ సంపాదించటం ఉండనే ఉన్నవి. ఇక్కడ ఓడినవారు తర్వాత ఛాన్స్‌కోసం కాచుకు కూర్చున్నారు.

అనుకున్న ప్రకారం మోహన్‌రావు ఇంటర్‌వ్యూకు వసంత మందిరానికి వెళ్ళాడు. నూనూగుమీసాల నూత్న యవ్వనుడు, కాలేజీ విద్యార్థి! చదువుతోబాటు సంస్కారమూ, నాగరికతా వంటబట్టించుకున్నవాడు బహుశా వసంత ఎన్నుకుంటుందనే అందరూ అనుకున్నారు. ఇంతమందిని నిరాశ చేయటం ఎందుకు లెమ్మన్న విధంగా వసంత అతన్ని అంగీకరించింది. అదృష్టవశాత్తూ ఆ రాత్రికే రమ్మని ఆహ్వానించి, వేయి రూపాయలూ తీసుకున్నది.

విషయం తేలిపోయింది కనుక మిగిలిన తొంభయితొమ్మిది మందిలోనూ ఇక ఈర్ష్యకు తావులేకుండా పోయింది. అందరూ శోభనపు పెళ్ళికొడుక్కు తగిన విధంగా సలహా లివ్వటం, యెంతో ఉత్తేజకరంగా, ఉత్సాహ ప్రోత్సాహాలను అందివ్వటం, మెచ్చుకోవటం తమ 'పదిరూపాయిల భాగమూ దుర్వినియోగం కాకుండా అనుభవాన్ని పిండుకోవాలి సుమా!' అని హెచ్చరికలు చేస్తూ- తమ ఖర్చులతోనే రాజభోజనం తినిపించారు.

ఒక విద్యార్థి తన కెలాగూ ఛాన్స్ లేదు కనుక, తన కొత్త టెర్లిన్‌పాంట్ వేసుకొని వెళ్ళమని మోహన్‌రావును మొహమాట పెట్టాడు. వసంత సంపర్కంతో ఆ పాంట్ పరమపావన మౌతుందని అతని నమ్మకం.

అదేవిధంగా మరొకడు తన షర్టూ, ఇంకొకడు తన కొత్త రిస్టువాచీ యిలా అనేక ఎరువు సొమ్ముల బరువుతో మోహన్ రావును వసంతమందిరం దాకా సాగనంపి, విద్యార్థులు హాస్టల్‌కు తిరిగి వచ్చారు.

అయితే వీళ్ళలో యెవరికి నిద్రపడుతుంది? 'మనవాడు ఇప్పుడు ఏమి చేస్తుండి ఉంటాడు?' అనే విషయాలమీద తీవ్రమైన చర్చలు సాగించారు. యెవరికి తోచింది వారు- అంతకన్న తానే 'మోహనరావై ఉంటే ఈపాటికి ఏం చేస్తుండి ఉంటాను' అనే దాన్ని ఒక్కొక్కరు ఒక్కో విధంగా ఊహించి వినిపిస్తూ తన్మయత్వంలో ఆనందపడ సాగారు.

ఇక ఇక్కడ వసంత మందిరంలోకి ఒకసారి తొంగిచూద్దాం: వసంత మూడు మాసాల అనుభవంలోనూ ఆమెకు ఇంత లేత మొగ మాంసపు పొత్తు పొసగలేదు. చిన్న వయసులోనే, ఇంత డబ్బిచ్చి స్త్రీతోటి సుఖాన్ని పొందేందుకు యీ నవయువకుడు

యెందుకు ఎలా సిద్ధపడి ఉంటాడో ఆమెకు అంతు బట్టలేదు. బహుశా చాలామంది స్త్రీల దగ్గర అనుభవాన్ని సంపాయించి ఉండొచ్చేమో ననుకున్న దామె!

అయితే నియమబద్ధమైన తన ప్రవర్తనలో విటుని తాలూకు హిస్టరీ, జాగ్రఫీలు కానీ, తదితర వివరాలు కానీ ఆమె యెన్నడూ అడగలేదు. తెలుసుకోవాలనే కుతూహలమూ ఆమెకు లేదు. ఎవరి బాధలు, సమస్యలు వారికి ఉంటవి. ఒకరి సమస్యల్ని మరొకరు తీర్చలేదు. అందుకని తెలుసుకొని మాత్రం ప్రయోజన మేమిటి? ఆ గాయాలను తనకు తానై తవ్వటం దేనికి? రసికుడు వచ్చింది రసాస్వాదనకే కదా! అన్నిటినీ మించి తెల్లవారుతే తమ మధ్య ఉండే అనుబంధాలన్నీ పటాపంచ లవుతవి కదా! అందుకని విటుణ్ని పారవశ్యంలో ముంచెత్తటానికే ఆమె ప్రయత్నించేది! తామరాకు మీది నీటిబొట్టుగానే గుట్టుగా గడిపివేసేది.

అలాటిది ఈనాడు మాత్రం ఆమెలో కుతూహలం దహించుకు పోతోంది. క్రీడారంభంలోనే ఈ మోహన్‌రావుకు విశేషానుభవం కాదు కదా, అసలు అనుభవమే లేదనే విషయం స్ఫటికమంత స్పష్టంగా ఆమెకు తెలిసిపోయింది. తనను ప్రియురాలుగా మాత్రమే గాక, గురువుగా కూడా స్వీకరించేందుకు అతను సిద్ధమయ్యాడు! విద్య ఈ రోజుల్లో ఎంత విలాసమో, ఎంత ధన వ్యయంతో కూడుకున్నదో ననిపించిందామెకు.

నాయకుని ప్రథమోద్రేకాలు ఉపశాంతిని పొందినవి.

విరామ సమయంలో మాటా మాటా కలిపి, మోహన్‌రావే జరిగిన విషయమంతా పూసగుచ్చినట్లు వసంతకు చెప్పాడు. ఆ కథంతా వింటూంటే వసంత చిరునవ్వులు చిలకరిస్తూ, లోలోన యెంతో గర్వపడసాగింది. తన పొందుకు గిరికీలు తిరిగే అనేకమంది యువకుల్ని తలుచుకొని, ఆమె వొళ్ళు పులకరించింది. తన ప్రియుల్లో దారితప్పి వచ్చిన ఈ విద్యార్థిని దోవ తప్పయినా సరే సత్కరించా లనుకున్నది.

ఇక్కడ... విద్యార్థి బృందం చర్చలు యెటూ తెగటంలేదు. అంతలో ఒక గడుగ్గాయి... "ఒరేయ్! ఫోన్‌చేసి చూద్దాం!" అన్నాడు.

"తప్పురా– ఈ సమయంలో మనం డిస్టర్బ్ చేయకూడదు!" అన్నాడు మరొకడు.

"మన డబ్బుపెట్టి పందెం కాచాం కదా! ఇదే గుర్రప్పందెంలో అయితే మన గుర్రం ఎలా వస్తోందో, జాకీ సరిగ్గా సవారిచేస్తున్నాడో లేదో తెలుసుకోకుండా ఉంటామా? కనుక యిప్పుడు ఫోన్ చేయాల్సిందే!"

"ఈ అర్ధరాత్రా?"

"నీకేం బాధ! నేను చూస్తాను!" అని ఒకడు బయలుదేరుతే వాడి వెనకే మరో నలుగురు వెంట నడిచారు.

ఇక్కడ–

శయన మందిరంలో ఫోన్ మోగగానే వసంత విలాసంగా రిసీవర్ తీసుకొని "యస్!" అన్నది.

"మోహనరావు కావాలండీ!"

ఆమె నవ్వుతూ రిసీవర్‌ను ఎత్తి అందించింది.

"ఎవరూ?" అన్నాడు మోహనరావు చికాకుతో.

"నేనురా - రామనాధాన్ని! అంతా సక్రమంగా జరుగుతోందా?"

"నీకేమన్నా బుద్ధి ఉందా? ఇప్పుడట్రా ఫోన్ చేసేది?"

"అడిగినదానికి సరిగ్గా జవాబు చెప్పవోయ్! బాగా గిట్టు బాటయేట్లు చేస్తున్నావా? ఇదంతా ప్రజా ధనమోయ్! డెమోక్రసీలో ప్రజలు పరిపాలకుల్ని నిలవదీసి ప్రశ్నలు అడుగుతారోయ్!"

"ఏడిశావ్! పానకంలో పుడకలాగ నువ్వొకడివి!"

"సక్రమంగా జరుపవోయ్!"

"ఆమె వింటుందనే జ్ఞానమన్నా లేదేం?"

ప్రశాంత నిశీథిలో అవతలినుంచి మాట్లాడేది కూడా వసంతకు స్పష్టంగా వినిపిస్తూనే ఉన్నది.

"అక్కడే ఉన్నదా?"

వసంత చప్పున మోహనరావ్ చేతిలోని ఫోన్ లాక్కుంది.

"ఇక్కడే ఉన్నానండీ! మీ కేండిడేట్ బాగా గిట్టుబాటు చేస్తూనే ఉన్నాడు. మీరు నిర్విచారంగా నిద్రపొండి!" అన్నదామె, పొడిపొడిగా నవ్వుతూ.

మోహనరావు ఫోన్ లాక్కున్నాడు.

"రోగం కుదిరిందా?"

"ఆమెకు అంతా చెప్పేశావా?"

"వసంత కంతా తెలిసిపోయింది. కనుక ఫోన్ పెట్టెయ్!" అని మోహనరావు తాను ఫోన్ పెట్టెయ్యటమే కాకుండా, రిసీవర్‌ను తీసి కింద ఉంచాడు.

"మళ్ళీ వాళ్ళు ఫోన్ చేస్తారేమో- ఎంగేజ్‌డ్ సౌండ్ వొస్తుందండీ!" అన్నది వసంత.

"నాకు తెలుసులే! మనం ఎంగేజ్‌డ్‌గానే ఉంటాం కనుక ఆ సౌండే వస్తుంది. యంగ్ ఏజ్‌లో ఉన్న మనకు అదే సరైనది కూడాను!" అన్నాడు మోహనరావు చిర్రుబుర్రులాడుతూ.

ఆ తరువాత. విద్యార్థులు ఎంత కొట్టుకున్నా లైన్ కనక్షన్ రాలేదు. నిరాశతో, నిట్టూర్పులతో రాత్రిలో మిగిలిన భాగాన్ని గడిపారు.

ఇక్కడ వసంత మందిరంలో రసాస్వాదనతో మత్తెక్కి, మైమరచి అత్యంత తృప్తితో ఆనందడోలికల్లో ఓలలాడాడు మోహనరావు.

తెలతెలవారుతూండగా వసంత దగ్గర సెలవు తీసుకొనేందుకు సిద్ధపడ్డా డతను.

"ఒక్క నిమిషం: చూడండి. ఈ సాహసిక గాథ నన్ను ఆశ్చర్యపరిచింది. ఇంతవరకూ నేను ఏ విటుణ్ణీ గౌరవించని విధంగా మిమ్మ్ము గౌరవించాలనుకున్నాను. నా మాట తీసెయ్యకండి. అపురూప లావణ్యవతి, అసాధారణమైన వెలగా ఒక్క రాత్రి అనుభవానికి వేయి రూపాయిలు తీసుకునే నా తోడి పొందును ఉచితంగా పొందామనే తృప్తికూడా మీకు ఉండాలని నా నిశ్చయం. కనుక మీరు ఇచ్చింది మీరు స్వీకరించండి–" అని వసంత, మోహనరావుకు పైకం యిచ్చేసింది.

❋ ❋ ❋

ఈ కథంతా చెప్పి వీర్యభేతాళుడు ఇలా అన్నాడు:

"రాజా! నా కొక్క సందేహం. వసంత యెంత గొప్ప వ్యాపారో నీకు తెలుసు. వెలయాలి కిచ్చిన వెలా, గోడకు వేసిన వెల్లా తిరిగి లభించటం కల్ల అని మనకు తెలుసు. వ్యాపార నియమాలను అతిక్రమించి ప్రవర్తించే తత్వం కాదామెది, అదీగాక ఏ ధనార్జన కోసమైతే ఆమె యీ వృత్తి స్వీకరించిందో దాన్నే వదులుకునేటంత అవివేకి అవలేదు కదా? అయినప్పుడు ఆమె ఈ విచిత్ర ప్రవర్తన యేవిధంగా సమర్థనీయ మౌతుంది? దీనికి జవాబు తెలిసివుండి కూడా చెప్పకపోయావో నీ తల వేయి వ్రక్క లవుతుంది!"

విక్రమార్కుడు యీ విధంగా జవాబు చెప్పాడు:

"వసంత వ్యాపారి మాత్రమే కాదు; అసాధారణ వ్యాపారి కూడాను. కనుకనే అత్యద్భుతమైన నియమావళిని ఆమె సర్వదా అనుసరిస్తూనే వచ్చింది. అయితే మానవజీవితం ఎప్పుడూ ఒకే మాదిరిగా జరుగుతూంటే 'బోర్' అనిపిస్తుంది. అప్పుడప్పుడయినా వేరు విధంగా ప్రవర్తించా లనిపిస్తూంటుంది. మొదటనుంచీ మోహన్‌రావ్ వ్యవహారమంతా విచిత్రంగానే ఉండటంవల్ల, ఆమె కూడా దారితప్పి– తనకూ హృదయమున్న దనీ, విటుడు మరింతగా గర్వపడేట్లు చేయాలనీ అనుకున్నది. ఇందువల్ల రసికుడు తిరిగి తిరిగి తన పొందును ఆశించటమే గాక, తనను గూర్చి చాలా గొప్పగా ప్రచారం చేస్తాడు... ఆమె ముఖ్యోద్దేశం ధనసంపాదనే ననటంలో యెలాటి సందేహమూ లేదు. తాను శ్రమపడి సంపాయించినదాన్ని ఆమె చూస్తూ

చూస్తూ వొదులుకోలేని మాట వాస్తవం. అయితే యిక్కడి నాయకుడికి 'తాను ఉచితంగా అనుభవించాను' అనే ఉద్దేశ్యాన్నీ, 'కనుక నీ విచ్చింది నీవే తీసుకో' మనీ అన్నదంటే అతను ఆమె కిచ్చిన మొత్తం వేయిరూపాయి లయినప్పటికీ, అదంతా ఇతరుల చందాలమీద సమకూరిందే కదా! పోతే నాయకుని వంతు అందులో పదే పది రూపాయిలు. ఆమె తిరిగి యిచ్చింది కూడా ఆ పదే. ఇంత చిన్న మొత్తంతో నాయకునిలో కలిగించే గర్వమూ, తనలో తాను నవ్వుకొని ఆనందించే సావకాశమూ సాధించబడినవి. ఇతరులు ఎంతెంతో పెద్ద మొత్తాలను ఇచ్చి కొనుక్కునే ఆనందంలాటిదాన్నే ఆమె కూడా ఇంత స్వల్ప మొత్తంతో కొనుక్కోవటంలో ఆశ్చర్యమేమిటి? ఇందువల్ల తెలివితేటలూ, విజ్ఞానమూ, చతురతలు కూడా వెల్లడై ప్రచారంలోకి వస్తవి. ఒక విధంగా తన వ్యాపారాభివృద్ధికిగాను ఆమె చేసిన వ్యయ మది. ఇలాటిదాన్ని ఇన్‌కంటాక్స్ వాళ్లు కూడా అనుమతించవలసే ఉన్నది కనుక- ఆమె వ్యాపార నియమాల్ని అతిక్రమించ లేదనే చెప్పవలసి ఉంటుంది. ముఖ్యంగా ఆమె పేరుప్రతిష్ఠలు విద్యార్థి ప్రపంచంలోపడి అల్లుకుపోయినవంటే త్వరలోనే ఆకాశపుటంచుల వరకూ ఎగబాకగలవు. అందుకనే ఆమె చేసింది త్యాగంగా కనిపించినప్పటికీ, అదంతా స్వప్రయోజన సాధనకే నని చెప్పక తప్పదు."

రాజుకు మౌనభంగం కావటంతో భేతాళుడు శవంతోసహా తుర్రున యెగిరి మర్రిచెట్టెక్కాడు.

*- జనవరి, 1966*